సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

- సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- ఐలవరంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- హాజరైన రాజ్యసభ సభ్యులు మోపిదేవి, వరికూటి అశోక్‌బాబు, తదితరులు



కార్మికులకు చేనేత చిలపల మిషన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి, వరికూటి తదితరులు

ఐలవరం(భట్టిప్రోలు): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని, రూ.28.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను గురువారం మంత్రి నాగార్జున రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావులతో కలసి ప్రారంభించారు. ఐలవరం క్లస్టర్ పరిధిలోని భట్టిప్రోలు–అద్దేపల్లికి చెందిన చేనేత కార్మికులకు రూ.32.74 కోట్ల వ్యయం చేసే స్టాండ్ మగ్గాలు, చిలపలు వెలిసే మిషన్‌లను అందజేశారు. గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న త్రీఫేజ్ విద్యుత్ పనులను సైతం ప్రారంభించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతంకు పైగా సీఎం అమలు చేశారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ మాటమీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అయితే... మోసానికి మారు పేరు చంద్రబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కి మనమంతా అండగా ఉండాలన్నారు. బౌడ చైర్మన్ దేవినేని మాట్లాడుతూ 34 సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు బలహీన వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. టీడీపీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, భట్టిప్రోలు, చెరుకుపల్లి జెడ్పీటీసీ సభ్యులు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మర్రివాడ వెంకట పావని, హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ఏడీవో ఉమా మహేశ్వరరావు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణ, మాజీ ఎంపీపీలు మార్ల హేమసుందరరావు, చెన్ను కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏడీవో ఎస్.భాస్కరరావు, ఇన్‌ఛార్జ్ ఏఈ పి.ఏడుకొండలు, తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, గట్టు శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామాభివృద్ధి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి



ఈవూరికి మద్దతుగా నిలిచిన పెనుమూడి గ్రామస్తులు

రేపల్లె రూరల్: పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో గురువారం గ్రామస్తులతో కాసేపు గడిపి అనంతరం మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా పాలనను సైతం గ్రామీణుల చెంతకే చేర్చారన్నారు. ప్రజలు తమకు అవసరమైన ధృవపత్రాల కోసం దూరప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళనవసరం లేకుండా గ్రామాలలోని సచివాలయాలలే సేవలు అందిస్తున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, మహిళల కోసం ప్రత్యేక పథకాలతో నిరంతరం ప్రజలకోసం కృషిచేస్తున్న నేత జగనన్న ఒక్కరే అన్నారు. రాబోవు ఎన్నికల్లో జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు నాయకులను కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారం విజయ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు పీటా సుబ్బరామయ్య తదితరులున్నారు.

ఘనంగా కూడారై పాశురం వేడుకలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



భక్తులు గోదాదేవికి సమర్పించిన సారె

రేపల్లెరూరల్: ధనుర్మాసం 27వరోజు సందర్భంగా రేపల్లె పట్టణం రైలుపేటలోని పట్టాభిరామస్వామి దేవాలయంలో కూడారై పాశురం వేడుకలు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా రంగనాథస్వామిని ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి అమ్మవారు 108 గంగాళాలలో పాయసం(పొంగలి) తయారు చేసి నివేదన చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ఆవరణలో అమ్మవారి ప్రతిమను రంగవల్లిగా రూపొందించి 108 పాయసపు గిన్నెలను స్వామివారికి నివేదించారు. ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవారికి అష్టోత్తర శతనామ పూజలు, తిరుప్పావై సేవ, శాత్తుముర్రై, ప్రత్యేక హారతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తడవర్తి విజయ్‌కుమార్, రాధికారాణి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో ఘనంగా కూడారై ఉత్సవం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ధనుర్మాసం పురస్కరించుకుని గురువారం గోదాదేవికి కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారుతీ సత్యసాయిరామ్ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయంలో ఈ నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను ఎస్ఎస్ఎఫ్ రేపల్లె ఖండ కన్వీనర్ రవికుమార్ భక్తులకు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు అందజేత



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): బాపట్ల నియోజకవర్గంలోని ప్రజానీకానికి సహాయం చేయడంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం మండలంలోని బోలాయపాలెం గ్రామంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక పింఛన్‌దారులకు దుప్పట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.పేదవాడికి కష్టం వచ్చిందంటే కోన ఛారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.సచివాలయ పరిధిలోని సామాజిక పింఛన్‌దారులకు దుప్పట్లు అందజేశారు.ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎల్లావుల ఏడుకొండలు, బాపట్ల ఏఎంసీ చైర్మన్ డి.సీతారామిరెడ్డి, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, గ్రామ సర్పంచ్ భావన్నారాయణ, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఎం.పరమానందకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కర్లపాలెం గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి అన్నారు. కర్లపాలెం మండలం ఎంపీ రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం..ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్టు విజయభాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, ఎంపీటీసీ సభ్యులు ఆసీఫ్ అలీ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మరమ్మతులకు రైల్వే గేటు మూసివేత

చుండూరు: వేమూరు రైల్వే గేటు మరమ్మతుల కోసం గేటు మూసి వేయడం జరుగుతుందని సెక్షన్ సీనియర్ ఇంజనీరు ప్రేమ్‌చంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నిలిపివేసేందు ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 7 రోజులు గేటు మూసి వేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా రైల్వే అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు



బాపట్ల అర్బన్: స్థానిక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో అలరించారు. పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ దోప్పలపూడి రామోహన్‌రావు, గెల్లి దిలీప్ కుమార్, కరస్పాండెంట్ జాయింట్ సెక్రెటరీ కొమినేని హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ తాళ్లూరి రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు వైస్ ప్రిన్సిపాల్ ఐ. హరిత, విభాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసుల వివరాల మేరకు.. నల్లచెరువు 23వ లైనుకు చెందిన బొడ్డు మరియన్న (45) పెయింటింగ్ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పుల బాధతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చిన్నమ్మాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో సేవలు సులభతరం

ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న కోన రఘుపతి

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్లిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రజలకు సేవలను మరింత చేరువ చేశారని గుర్తుచేశారు. గత టీడీపీ హయాంలో ఏపని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పని ఉండేదని గుర్తుచేశారు. కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు యారం వనజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లావుల ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ యల్లావుల సురేష్ రాదవ్,వైస్ ఎంపీపీ పందబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, బాపట్ల ఏఎంసీ చైర్మన్ డి.సీతారామిరెడ్డి, సినీ రచయిత కోన వెంకట్, ఆట్ల నాగేశ్వరరెడ్డి,యారం ఇస్సాకు తదితరులు ఉన్నారు.

చుండూరులో అడ్వైజరీ కమిటీ సమావేశం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు సబ్‌స్టేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం గురువారం ఎంపీపీ జాలాది రూబెన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చుండూరు మండలంలో రైతులు, ప్రజలకు విద్యుత్తు అంతరాయం కలగకుండా, మోటర్ షెడ్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులు విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉయ్యూరి అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరణ



బాపట్ల అర్బన్: జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఝాన్సీ రాణి కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాల్లో భాగంగా రెండో రోజు గురువారం వెదుళ్లపల్లిలోని చైతన్య భవన్‌లో జరిగింది. ముందుగా గ్రూప్–2, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు అవగాహన కల్పించేందుకు నిర్వాహక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చందోలులో ఘనంగా అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో గురువారం అమావాస్య హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శేష వాహనంలో వేణుధారి శ్రీకృష్ణ పరమాత్మునిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, నరసారెడ్డి, బళ్ళారెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



షటిల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



రేపల్లెలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

కొల్లూరు : ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. కొల్లూరులో గురువారం నిర్వహించిన క్రికెట్, షటిల్, ఖోఖో పోటీలు సెమీఫైనల్ దశకు చేరుకున్నాయి. క్రికెట్ పోటీలు పురుషుల విభాగంలో దోనేపూడి–జువ్వలపాలెం, పెసర్లంక–కొల్లూరు2 జట్లు శుక్రవారం జరగనున్న సెమీఫైనల్లో తలపడనున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో పురుషుల విభాగంలో కొల్లూరు–2, ఈపూరులంక, మహిళల విభాగంలో కొల్లూరు–1, కొల్లూరు–3 జట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, ఖోఖో పురుషుల విభాగంలో రావికంపాడు, కొల్లూరు–3, మహిళల విభాగంలో కొల్లూరు–1, దోనేపూడి జట్లు సెమీఫైనల్‌లో పోటీపడనున్నాయి. వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో శుక్రవారం 16 సచివాలయాల పరిధిలోని జట్లు తలపడునున్నాయి. పోటీలను సచివాలయ సిబ్బంది, పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు పర్యవేక్షించారు.

రేపల్లెరూరల్: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు రెండోరోజు పట్టణంలో ఉత్సాహభరితంగా సాగాయి. రేపల్లె పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రీడలను మున్సిపల్ కమిషనర్ విజయసారధి గురువారం పర్యవేక్షించారు. రెండవ రోజు మండలస్థాయిలో బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర, బాలికల విభాగంలో జరిగిన పోటీలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి, పట్టణం నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో సందడి వాతావరణం నెలకొంది. క్రీడామైదానం వద్ద క్రీడాకారులకు తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

పంటపొలాల్లో ఆస్ట్రేలియన్ విద్యార్థులు



పంటపొలంలో సెన్సార్ల వివరాలను తెలుసుకుంటున్న ఆస్ట్రేలియన్ విద్యార్థులు, విద్యాసాగర్

తెనాలి: ప్రవాస భారతీయుడు, ఆస్ట్రేలియాలోని నోట్రెడేమ్ యూనివర్సిటీకి సిడ్నీలో గల స్కూల్ ఆఫ్ లా అండ్ బిజినెస్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ అత్తోట విద్యాసాగర్, అక్కడి విద్యార్థులు శీతాకాలం సెలవుల సందర్భంగా తెనాలి వచ్చారు. విద్యాసాగర్ ఇక్కడ నిర్వహిస్తున్న స్వచ్ఛంద పాఠశాల దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూలుకు, ఆయనతోపాటు పని చేసే ఉపాధ్యాయులు, విద్యార్థులు సెలవుల్లో ఇక్కడకు వస్తుంటారు. స్కూలు పిల్లలకు బోధనోపకరణాలు, ఆటపాటలతో పాఠాలను నేర్పుతారు. భారతీయ జీవన విధానం, పంటలను పరిశీలించి వెళుతుంటారు. ఆ క్రమంలో ఇటీవల తెనాలి వచ్చిన విద్యాసాగర్, ఆస్ట్రేలియా విద్యార్థులు టియార్నా బోనో, క్లోయీ పియర్సన్, లాచియన్ ఫ్లెమింగ్ గురువారం కొల్లిపరలోని శ్రేష్ట ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీని సందర్శించారు. కంపెనీలో కలెక్షన్ సెంటర్, పసుపు పొడి తయారీ, కోల్ట్ స్టోరేజిని పరిశీలించారు. వానపాముల ఎరువు, పంటపొలాల్లో భూమి ఆరోగ్యం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన సెన్సార్లను చూసి, పనితీరును తెలుసుకున్నారు. కంపెనీ డైరెక్టర్, సేంద్రియ రైతు వుయ్యూరు సాంబిరెడ్డి వీరికి వివరాలను తెలియజేశారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

పెదకాకాని: డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళాపరిషత్ 13వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు తెలిపారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మోపర్తి కాళిదాసు మాట్లాడుతూ డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ మూడు నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. నిత్యం సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించడంతో పాటు నేటి సమాజానికి మంచిని పంచాలనే ఆశయంతో ఈ నాటికల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు మోపర్తి నాగేశ్వరరావు, మోపర్తి సదాశివరావు, మోపర్తి పరమేశ్వరరావు, నందిపాటి ప్రసాద్, పాములపాటి శ్రీనివాసరావు, షేక్ గాలీబు, మోపర్తి రాంబాబు, యడ్లపల్లి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో కొమ్మమూరు కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం లభించింది. గుంటూరు నగరంలో ఏటుకూరు రోడ్డులోని దర్గా మన్యంకు చెందిన కొలూరి నాని(18) తన తమ్ముడు, మరో ఇద్దరు స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామి దేవస్థానం వద్దకు బుధవారం వెళ్లి కాల్వలోకి దిగి నీటి ప్రవాహానికి గల్లంతైన సంగతి తెలిసిందే. యువకుడి ఆచూకీ కోసం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం గాలింపు చేపట్టగా సంగం జాగర్లమూడి లాకుల వద్ద మృతదేహాన్ని కాల్వలో గుర్తించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహాత్మా ఆశ్రమానికి రూ.లక్ష విరాళం

తెనాలి: పట్టణానికి చెందిన ప్రవాస భారతీయ నర్సు గంటెనపల్లి భాగ్యమ్మ స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆమె ఆశ్రమాన్ని సందర్శించారు. మహాత్మాగాంధీ, కస్తూర్బా విగ్రహాలకు పూజలు చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు స్వీట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారికి రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో అదే గ్రామానికి చెందిన తిప్పాబత్తిన రాజ్‌కుమార్ గుట్టుచప్పుడు కాకుండా తన ఇంట్లోనే అక్రమంగా మద్యం దాచి విక్రయిస్తున్నాడన్న సమాచారం సెబ్ ఎస్ఐ గీతకు అందింది. దీంతో ఆమె తన సిబ్బందితో కలిసి రాజ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేశారు. మూటగట్టి ఉన్న తెల్లగోతంలో 20 విస్కీ బాటిల్స్ ఉండటాన్ని గుర్తించి బాటిల్స్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాక్సెంచర్ సంస్థకు ఎంపికైన విద్యార్థులు

పెదకాకాని: ప్రతిష్మాత్మక బహుళ జాతీయ సంస్థ, గ్లోబర్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ యాక్సెంచర్ నందు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 176 మంది విద్యార్థులు ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నియామకాలు కొరకు ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో సరైన ప్రణాళిక, మానసిక సంసిద్ధత ద్వారా భారీ సంఖ్యలో వీవీఐటీ విద్యార్థులు నియామకాలు పొందగలిగారని తెలిపారు. 2023 డిశంబరు 1 నుంచి 15వ తేదీ వరకూ యాక్సెంచర్ సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరచడం ద్వారా ఈ నియామకాలు లభించాయన్నారు. నియామకాలు పొందిన విద్యార్థులకు 6.5 లక్షల నుంచి 4.5 లక్షల రూపాయల వరకూ వార్షిక వేతనాలు సంస్థ కేటాయించినట్లు తెలిపారు.

సాయి ప్రసాదం సేవాసమితి వితరణ



ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న సాయి లక్కరాజు

తెనాలి: అన్నదానం అన్ని దానాల్లోకి విశిష్టమైనదని పట్టణానికి చెందిన సాయి ప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకులు సాయి లక్కరాజు అన్నారు. స్థానిక చినరావూరు డొంకలోని పేదలకు గురువారం సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విశ్రాంత బ్యాంకు అధికారి, సాయిబాబా సేవకులు హెచ్ఆర్ లక్కరాజు జన్మదినం సందర్భంగా ఈ వితరణ చేశారు. ప్రతి ఒక్కరూ తమ సుఖసంతోషాలను పేదలతో పంచుకోవటం వల్ల దేవుడి కృప పొందగలరని సాయి లక్కరాజు అన్నారు. విశ్రాంత ప్రభుత్వ అధికారి వెంకటరమణ, సేవా సమితి సభ్యులు కోటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం

తెనాలిఅర్బన్: కంప్యూటర్ విద్య ద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలు పొందవచ్చని అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ జి.సాయిరేవతి పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్ అకాడమీలో ఎంఎస్ ఆఫీస్, సీ, సీప్లస్‌ప్లస్, ఒరాకిల్, జావా వంటి కంప్యూటర్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అకాడమీ డైరెక్టర్ విజయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.